క్లుప్తంగా

సమస్యలను స్థానికంగా పరిష్కరించుకోవాలి



సమస్యలు వింటున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: చిన్న చిన్న సమస్యలను గ్రామాల్లో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మండల స్థాయి అధికారుల కో–ఆర్డినేషన్ కార్యక్రమంలో భాగంగా అర్జీదారుల నుంచి సమస్యలు విన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తగాదాలకు పోకుండా సాధ్యమైనంతలో పెద్దల సమక్షంలో సమస్య పరిష్కారమయ్యేలా చూసుకోవాలన్నారు. వివాదాలకు తావులేకుండా చూసుకోవాలన్నారు. ఎస్ఐ పి.ప్రసాదరావు,ఎంపీడీవో ఎం.ఉషారాణి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాణసంచా గోదాముల పరిశీలన



బాణసంచా గోదాములను పరిశీలిస్తున్న అధికారులు

పాయకరావుపేట: పట్టణంలో బాణసంచా (మందుగుండు సామగ్రి) గోదాములను అధికారులు పరిశీలించారు. పాయకరావుపేట పట్టణ పరిధిలోను, అరట్లకోట గ్రామ పరిధిలోను లైసెన్స్ కలిగిన బాణసంచా వ్యాపారి కంభంపాటి వెంకటరమణకు చెందిన గోదాములను తహసీల్దారు సత్యనారాయణ, సీఐ జి.అప్పన్న, లేబరు ఆఫీసర్ ఎస్.వెంకటరావు, ఫైర్ ఆఫీసర్ డి.రాంబాబు, తూనికలు కొలతల అధికారులు తనిఖీ చేశారు.

తిమ్మరాజుపేటలో పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

మునగపాక: తిమ్మరాజుపేటలో తాగునీటి సమస్య రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు తెలిపారు. గ్రామంలో ఇంటింటి కుళాయిలకు తాగునీటిని సరఫరా చేస్తున్న పైపులైన్ దెబ్బతింది. ఈ మేరకు శనివారం తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు అవసరమయ్యే చర్యలను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, పంచాయతీ కార్యదర్శి రమణరావు పాల్గొన్నారు.

66 లీటర్ల సారా స్వాధీనం



బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పాయకరావుపేట: మండలంలో రాజవరం, రాజానగరం, పెదరాంభద్రపురం గ్రామాల పరిధిలో దాడులు నిర్వహించి 66 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. సారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామన్నారు. దీనికి సంబంధించిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి యలమంచిలి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



దళితవాడలో బ్లీచింగ్ పిచికారీ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక దళితవాడలో దోమల నివారణకు బ్లీచింగ్ పిచికారీ పనులు శనివారం చేయించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నీరు నిలువ ఉండిపోతే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాలనీలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

చల్లగా.. తియ్యగా.. జాగ్రత్తగా..!



- సూర్యతాపంతో పండ్ల రసాలకు పెరిగిన గిరాకీ
- జ్యూస్ సెంటర్లు, ఐస్‌క్రీమ్ పార్లర్లలో రద్దీ
- కొన్ని చోట్ల తుప్పు పట్టిన ఫ్రిజ్‌లు, కుళ్లిన పండ్లు, బొద్దింకలు
- పానీయాలపై అప్రమత్తత అవసరమంటున్న వైద్యులు



యలమంచిలి ప్రధాన రహదారి పక్కన జ్యూస్ సెంటర్

యలమంచిలి రూరల్: భానుడు ఉగ్రరూపానికి తాళలేక ప్రజానీకం తాత్కాలిక ఉపశమనం కోసం శీతల పానీయాలను లీటర్ల కొద్దీ తాగేస్తున్నారు. ఎక్కువ శాతం పండ్ల రసాలను జుర్రేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుచి, శుభ్రత, తదితర జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. యలమంచిలి పట్టణం, మండలం సహా 16వ నెంబరు జాతీయ రహదారి, రాష్ట్ర రహదారుల వెంబడి వేసవిని దృష్టిలో ఉంచుకుని పండ్లు, చెరకు, నిమ్మ రసాలు, మజ్జిగ తదితర దుకాణాలు, ప్రత్యేక స్టాళ్లు, బండ్ల దుకాణాలు అందుబాటులోకి వచ్చాయి. శుచి, శుభ్రత పాటిస్తున్నారా.. నాణ్యమైన పదార్థాలను వాడుతున్నారా.. అనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి. వీటిపై ఆహార భద్రతా అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు ఉండడం లేదు. ప్రజలు కూడా పండ్ల రసాల దుకాణాలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అపరిశుభ్ర వాతావరణంలో, కుళ్లిన పండ్లతో తయారు చేసిన, నిల్వ ఉంచిన పండ్ల రసాలను ప్రజలకు విక్రయిస్తున్నారు. అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎండ తాపానికి ఎడాపెడా పండ్ల రసాలు తాగేస్తున్నారు. ఒక్క నిమిషం ఆగి పండ్ల రసం తయారు చేస్తున్న దుకాణంలోని పరిస్థితులను గమనించి, శుభ్రత ఉన్న దుకాణాన్ని ఎంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. యలమంచిలి పట్టణంలో ఎక్కువ పండ్ల రసాల దుకాణాల వద్ద అపరిశుభ్ర వాతావరణం, దుర్భర పరిస్థితులు కనిపిస్తున్నాయి. తుప్పు పట్టి ఉన్న ఫ్రిజ్‌లోనే పండ్లు ఉంచుతున్నారు. నీటి పరీక్షల రిపోర్టులు, బొద్దింకల నిరోధక వ్యవస్థ లేవు. బొద్దింకల సంచారం, దుకాణాల్లో ఈగల మోత ఎక్కువగా ఉంటోంది.



యలమంచిలి పట్టణంలో ఓ పండ్ల దుకాణం వద్ద పండ్ల రసాల అమ్మకాలు

కృత్రిమ రుచులు.. హానికారక ఐస్ గడ్డలు

పండ్ల రసాల దుకాణాలు, పార్లర్లలో కొన్నిచోట్ల కృత్రిమంగా తయారు చేసిన రుచులు(ఫ్లేవర్లు) వినియోగిస్తున్నారు. ఇలాచీ, బాదం, పిస్తా రుచులు, రంగుల పొడులు కలుపుతారు. ఆకర్షణ కోసం వివిధ రంగుల మిశ్రమాన్ని కలిపిన పండ్ల రసాలు తాగితే అనారోగ్యకరం. ఇక పండ్ల రసాల్లో వినియోగిస్తున్న ఐస్ గడ్డలు కూడా ఎంతో హానికారకంగా ఉంటున్నాయి. సాధారణంగా మంచినీటితో తయారయ్యే ఐస్ గడ్డలు ఎక్కువ సమయం ఉండవు. మలినాలతో కూడిన నీటితో తయారయ్యే ఐస్ గడ్డలు ఎక్కువ సమయం కరిగిపోకుండా ఉంటాయి. రవాణాకు సౌకర్యంగా ఉంటాయి. ఊక వేసి ఐస్ గడ్డలు కరగకుండా చేస్తారు. హానికారక బాక్టీరియా ఉండే నీళ్లతో చేసిన మంచు గడ్డలను కలిపిన పండ్ల రసాలను తీసుకుంటే ఆరోగ్యం దెబ్బతింటుంది. అలాంటి పండ్ల రసాల జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. కొన్ని పండ్ల రసాల సెంటర్లలో పండ్లు, ఇతర పదార్థాలను పుచ్చిపోయిన వాటిని వినియోగిస్తున్నారు. కొన్ని చెరకు గడలకు ఫంగస్ ఉంటుంది. యంత్రంలో మొత్తం క్రషింగ్ చేసి రసం తీస్తున్నారు. జ్యూస్ ఎలాంటి పండ్లు, పదార్థాలను వాడుతున్నారనేది వినియోగదారులు గమనించాలి.



పట్టణంలో మరో జ్యూస్ సెంటర్

జాగ్రత్తగా లేకపోతే దుష్పరిణామాలు



పండ్ల రసాల తయారీ దశలో కలుషితమైతే హెపటైటిస్ ఏ వైరస్ సంక్రమించి పచ్చ కామెర్లు వచ్చే ప్రమాదం ఉంది. ఈకోలి బాక్టీరియాతో వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్, నులి పురుగుల సంక్రమణ, గొంతు నొప్పి, వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు, దంతాల బలహీనత, జీర్ణ వ్యవస్థ దెబ్బతినే అవకాశం లేకపోలేదు. క్రిమిసంహారక మందులతో పండిన పండ్లను సరైన విధానంలో శుభ్రం చేయకపోతే క్యాన్సర్ లాంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. వేసవి తీవ్రత కారణంగా శరీరంలోని లవణాలను కోల్పోవాల్సి వస్తుంది. అందులో ప్రధానంగా పొటాషియంను భర్తీ చేయడంలో తాజా పండ్లు కీలక పాత్ర పోషిస్తాయి. పండ్ల రసాలు సహజ సిద్ధంగా లభించేవి తీసుకోవాలి. ఇంట్లోనే రసం తయారు చేసుకోవాలి. చక్కెర లాంటివి కలిపి తీసుకోవద్దు. ఎవరి ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉంటుంది.

– డాక్టర్ ఎస్ సంతోష్ కుమార్, కమల హాస్పిటల్, యలమంచిలి

మునగపాకలో స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. శనివారం మునగపాకలో స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్‌లో భాగంగా మానవహారం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వచ్ఛత పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలు సస్యశ్యామలంగా ఉండేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా వ్యాధులు ప్రబలవన్నారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఈవోపీఆర్డీ సోమరాజు, మొల్లేటి సత్యనారాయణ, కోనపల్లి రామ్మోహనరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

మునగపాక: కొద్ది రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. దీంతో వినియోగదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. దీంతో వ్యవసాయ రంగానికి సరఫరా లేదు. ఈ విషయమై సాక్షి దినపత్రికలో ఈ నెల 18న విద్యుత్ కోతలు..తప్పని వెతలు పేరిట కథనం వెలువడింది. దీంతో ఆ శాఖ ఏఈ శరగడం జగదీష్, సిబ్బంది స్పందించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకున్నారు. మునగపాక మెయిన్‌రోడ్డులో దెబ్బతిన్న స్తంభాలను సరిచేసి వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు తీసుకున్నారు. వినియోగదారులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు పరిశీలిస్తున్న ఏఈ జగదీష్

పోషకాహారం శ్రేయస్కరం

మునగపాక: మండలంలోని గంగాదేవిపేట గ్రామంలో శనివారం సంచార చికిత్సా కార్యక్రమం నిర్వహించారు. మునగపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించి రోగులకు హెచ్ఎస్ సీతామహలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ యామిని, ఏఎన్ఎం రమణి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వారు మాట్లాడుతూ సీజన్‌లో రోగాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిబిరాన్ని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర పర్యవేక్షించారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు వాకపల్లి నూకాలమ్మ పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న మూలపేట ఉప సర్పంచ్ దేవీచంద్ర

మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక: ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై ఎస్ఐ పి.ప్రసాదరావు కేసులు నమోదు చేశారు. శనివారం సాయంత్రం మునగపాక మెయిన్‌రోడ్డులో ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. అధిక లోడుతో వెళ్లే వాహనాలు, లైసెన్స్,హెల్మెట్ లేకుండా నడిపేవారిపై కేసులు నమోదు చేశారు. ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు.



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ ప్రసాదరావు

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత



హెచ్‌ఎంకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న గణిత ఉపాధ్యాయుడు పట్నాయక్

అచ్యుతాపురం రూరల్: హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు ఎంజే పట్నాయక్ విద్యార్థులకు క్రీడా సామగ్రి శనివారం అందజేశారు. హెచ్ఎం శ్రీపాద రవి, ఫిజికల్ డైరెక్టర్ ధర్మిరెడ్డి రాజు సమక్షంలో వాలీబాల్, త్రో బాల్ అందజేశారు. గతంలో రూ.8 వేల విలువైన వాలీబాల్ ఐరన్ స్టాండర్డ్, త్రో బాల్ పోల్స్, రూ.3 వేల త్రో బాల్, వాలీబాల్ అందజేసినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు కేఆర్ఆర్ కుమార్, గాంధీ, బాషా, అమ్మాజీ, హైమవతి పాల్గొన్నారు.

ఐఎన్టీఎస్‌వోలో విద్యార్థుల ప్రతిభ



విజేతలుగా నిలిచిన విద్యార్థులు

పాయకరావుపేట: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఐఎన్టీఎస్‌వో) రెండో దశ పరీక్షలో పాయకరావుపేటకు చెందిన శ్రీ చైతన్య విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ దశలో మొత్తం 212 మంది విద్యార్థులు విజేతలుగా నిలవడం గర్వకారణమని నిర్వాహకులు తెలిపారు. వీరికి లెనోవా టాబ్స్, స్మార్ట్‌వాచ్‌లు, ప్రత్యేక బహుమతులు లభించాయి. ఎంఈవో గాంధీ అభినందించారు. శ్రీ చైతన్య విద్యాలయ ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఏజీఎం సురేష్, ఆర్ఎల్ గోపీ, అకడమిక్ కో–ఆర్డినేటర్ పట్నాయక్, సీ బ్యాచ్ ఇన్‌చార్జి లక్ష్మీకాంతం, వైస్ ప్రిన్సిపాల్ రమణ, డీన్ మనీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



రోగులను ఎలా కాపాడాలో వివరిస్తున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది

యలమంచిలి రూరల్: పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో సిబ్బంది, యాజమాన్యాలకు శనివారం అవగాహన కల్పించారు. తప్పనిసరిగా అగ్ని నిరోధక పరికరాలు, వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని యలమంచిలి ఫైర్ ఆఫీసర్ డి. రాంబాబు సూచించారు. వెంకటేశ్వర నర్సింగ్ హోమ్, విజ్జు డెంటల్ ఆస్పత్రిలో రెస్క్యూ ఆపరేషన్స్‌పై మాక్‌డ్రిల్ నిర్వహించారు. దంత వైద్యుడు నాయుడు పాల్గొన్నారు.

ఈ – వ్యర్థాల సేకరణకు ప్రత్యేక కౌంటర్



మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ - వ్యర్థాల సేకరణ కౌంటర్

యలమంచిలి రూరల్: కుప్పలుతెప్పలుగా పేరుకుపోతున్న ఈ – వ్యర్థాలతో భూమి, నీరు, గాలి కలుషితమవుతున్నాయని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు అభిప్రాయపడ్డారు. శనివారం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా ఈ – వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈ – వ్యర్థాల సేకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్టు కమిషనర్ తెలిపారు. పట్టణ ప్రజలు పాడైన టీవీలు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, ఏసీలు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు మొదలైన ఈ – వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా పడవేయవద్దన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ – వ్యర్థాల ప్రత్యేక కౌంటర్‌లో అందజేయాలని కోరారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి దిమిలి రోడ్డు కూడలి వరకు ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. తడిపొడి చెత్త, నిషేధిత ప్లాస్టిక్ సంచుల వినియోగంపై తమకు సహకరించాలన్నారు. మెప్మా సీఎంఎం పద్మావతి, మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, టీపీవో శ్రీలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, ఏఈ గణపతి సుబ్బారావు, సచివాలయాల సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ స్థాయి బాలల సంరక్షణ కమిటీ ఏర్పాటు

మునగపాక: మండలంలోని గంటవానిపాలెంలో గ్రామ స్థాయి బాలల సంరక్షణ, సంక్షేమ కమిటీని శనివారం నియమించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో 11మందితో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ విభాగం క్షేత్రస్థాయి కార్యకర్త కేఎల్‌వీ రమ్య మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం ద్వారా తీసుకునే చర్యలు, బాలికలపై వేధింపులు తదితర అంశాలకు సంబంధించి కమిటీ సభ్యులు బాధ్యతగా పనిచేయాలన్నారు. కమిటీ సభ్యుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ కోన వెంకటలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ విభాగం క్షేత్రస్థాయి కార్యకర్త రమ్య

శ్రీరామ నామస్మరణతో మార్మోగిన గ్రామాలు

అచ్యుతాపురం: గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అయోధ్య రాముడు 'మా ఊరు వచ్చారంటూ మహిళలు తన్మయత్వం చెందారు'.. ఊరూరా రామ నామస్మరణతో మార్మోగింది. శనివారం తంతడి, రాజన్నపాలెం, గండివానిపాలెం, దోసూరు, మడుతూరు, రామన్నపాలెం గ్రామాల్లో శ్రీరామ రక్షా రథ యాత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులు ఇస్తూ రథయాత్రకు స్వాగతం పలికారు. కోలాటాలు, భజనలు, కీర్తనలతో తమ భక్తితత్వాన్ని చాటుకున్నారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, గంగాధర్, రాజాన సన్యాసినాయుడు, కూండ్రపు నాయుడు, కొల్లి అప్పారావు, రాజాన నానాజీ, మోటూరు సంజీవి, ధర్మిరెడ్డి నాయుడుబాబు, లాలం శ్రీను, ధర్మిరెడ్డి రాము, జువ్వాల నాయుడు, చోడపల్లి సత్యం పాల్గొన్నారు.



కోలాటం ప్రదర్శిస్తున్న భక్తులు

ఈ–వ్యర్థాల సేకరణ

అచ్యుతాపురం రూరల్: సర్పంచ్ కె. విమలా నాయుడు ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో ఈ–వ్యర్థాలు సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఈ–వ్యర్థాలు పంచాయతీ కార్మికులకు అందజేయాలని ఈవోపీఆర్డీ శ్రీరాములు నాయుడు, సెక్రటరీ శైలజా రాణి తెలిపారు. జనసేన పార్టీ మండల నాయకుడు ద్వారపురెడ్డి బాబ్జి, గ్రంథ పాలకుడు డి.కోటేశ్వ ర్రావు, బొండల శ్యామ్, పంచాయతీ అసిస్టెంట్ మూర్తి పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు



కె.వెంకటాపురంలో ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది



పరిశుభ్రత కార్యక్రమం చేపడుతున్న దృశ్యం



స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర నిర్వహిస్తున్న అధికారులు

కోటవురట్ల: మండలంలో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో పారిశుధ్య పనులు నిర్వహించారు. కె.వెంకటాపురంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు ర్యాలీ చేశారు. పలు వీధుల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తలను తొలగించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పైల నాని, గ్రామస్తులు పాల్గొన్నారు. జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం షేక్ అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన కల్పించారు.

పాయకరావుపేట: స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం పట్టణంలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.జయప్రకాష్ రావు, ఈవోఆర్డీ సిహెచ్ చంద్రశేఖర్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని కొరుప్రోలు ఆయుర్వేదిక్ వైద్యురాలు సుజాత తెలిపారు. కొరుప్రోలు ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో పరిధిలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. రోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఫార్మసిస్ట్ రామకృష్ణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రంథాలయ పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తెలిపారు.